# 2.1 లక్షల టన్నులు

- సింగరేణిలో ఇక నిత్యం చేయాల్సిన బొగ్గు ఉత్పత్తి, రవాణా
- మార్చి నాటికి 720 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా
- ఈ ఏడాది రూ.40వేల కోట్ల టర్నోవర్, రూ.3500 కోట్ల లాభాలు సుసాధ్యం
- సీఎండీ శ్రీధర్ దిశా నిర్దేశం




సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ శ్రీధర్



వీసీలో పాల్గొన్న జీఎంలు, ఇతర అధికారులు

రామగిరి/శ్రీరాంపూర్, అక్టోబర్ 3: దేశ వ్యాప్తంగా బొగ్గుకు తీవ్రమైన డిమాండ్ ఏర్పడుతున్నదని, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా మిగిలిన 6 నెలల కాలంలో నిత్యం కనీసం 2.10 లక్షల టన్నుల ఉత్పత్తి, రవాణా చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ సూచించారు. తద్వారా మార్చి నెలాఖరుకల్లా 720 లక్షల టన్నుల వార్షిక లక్ష్యాన్ని దాటాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల జీఎంలతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి ఆరు నెలల కాలంలో వర్షాల వల్ల కొంత ఇబ్బంది కలిగినప్పటికీ అన్ని అవరోధాలను అధిగమిస్తూ గత ఏడాదిపై బొగ్గు రవాణాలో 12 శాతం వృద్ధిని, బొగ్గు ఉత్పత్తిలో 7 శాతం వృద్ధిని, ఓబీ తొలగింపులో దాదాపు 15 శాతం వృద్ధిని సాధించడంపై సీఎండీ హర్షం వ్యక్తం చేశారు. మిగిలిన ఆరు నెలల కాలం ఎంతో కీలకమైందని, బొగ్గుకు తీవ్రమైన డిమాండ్ వస్తున్నట్లు చెప్పారు. అన్ని ఏరియాలకు అవసరమైన యంత్రాలు, అనుమతులు, ఓబీ కాంట్రాక్టులు ఇప్పటికే సమకూర్చినట్లు వివరించారు. ఇకపై వర్ష ప్రభావం ఉండబోదని, రానున్న వారం రోజుల్లోగా ఓసీపీ క్వారీల్లో నిలిచి ఉన్న నీటిని బయటకు తోడి వేయాలని సూచించారు. ఉత్పత్తి, ఓబీని ఇచ్చిన లక్ష్యాల మేర విధిగా సాధించాలన్నారు. దీని కోసం ఏరియా స్థాయిలో సమీక్షా సమావేశాలు నిర్వహించి ముందుకు సాగాలన్నారు. అన్ని ఏరియాలు లక్ష్యాలు సాధిస్తే ఈ ఏడాది నిర్దేశిత 720 లక్షల టన్నుల వరకు బొగ్గు ఉత్పత్తి, రవాణా చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. తద్వారా 40వేల కోట్ల టర్నోవర్, సుమారు 3500 కోట్ల లాభాలు సాధించే అవకాశం ఉందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకే దఫా రూ.1750 కోట్ల వేజ్‌బోర్డు ఏరియర్స్ చెల్లించామని, అలాగే సీఎం కేసీఆర్ ప్రకటించిన విధంగా 32 శాతం లాభాల వాటా మొత్తం రూ.711 కోట్లు దసరా పండుగకు ముందే విడుదల చేయనున్నామని ప్రకటించారు. ఆ తర్వాత దీపావళి బోనస్ కూడా పండుగకు ముందే కార్మికుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు.

### లక్ష్యాలను దాటిన సింగరేణి

ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెల నుంచి సెప్టెంబర్ మాసానికి గల అర్ధ సంవత్సరంలో సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి, రవాణాలో నిర్దేశిత లక్ష్యాలను సాధించింది. ఈ అర్ధ సంవత్సరం బొగ్గు రవాణా లక్ష్యం 307 లక్షల టన్నులు కాగా సింగరేణి ఈ లక్ష్యాన్ని దాటి 330 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిపి 7 శాతం వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలానికి బొగ్గు రవాణాతో పోల్చి చూస్తే ఇది 12 శాతం అధికం. అలాగే ఈ ఏడాది తొలి అర్ధ సంవత్సర బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 314 లక్షల టన్నులను సాధించి వంద శాతం లక్ష్య సాధనతో నిలిచింది. గత ఏడాది ఇదే కాలానికి సాధించిన బొగ్గు ఉత్పత్తి తో పోల్చి చూస్తే 7.15 శాతం వృద్ధిని నమోదు చేయడం గమనార్హం. ఓబీ తొలగింపులో ఇదే కాలానికి సాధించిన 171.30 లక్షల క్యూబిక్ మీటర్ల కన్న మిన్నగా ఈ ఏడాది తొలి అర్ధ సంవత్సంలో 14.84 శాతం వృద్ధితో 196.72 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓబీని సింగరేణి సాధించింది. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## స్పెషల్ క్యాంపెయిన్ ప్రారంభం

గోదావరిఖని, అక్టోబర్ 3: ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో స్వచ్ఛతా స్పెషల్ క్యాంపెయిన్ 3.0ను జీఎం చింతల శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ కోల్ మినిస్ట్రీ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో అక్టోబర్ 2 నుంచి 31వరకు పని స్థలాల్లో పరిసరాల శుభ్రత, కార్యాలయాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, కాలనీల సుందరీకరణ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ క్యాంపెయిన్‌ను విజయవంతం చేసి ఆర్జీ-1ను ముందంజలో నిలపాలన్నారు. మన పరిసరాలను, పని స్థలాలను శుభ్రంగా ఉంచినట్లయితే దేశం కూడా శుభ్రంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, ఏజీఎం లక్ష్మీనారాయణ, ఆంజనేయ ప్రసాద్, యూనియన్ల నాయకులు సత్యనారాయణ, సాయిరెడ్డి, సారంగపాణి సిబ్బంది పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

యైటింక్లయిన్ కాలనీ, అక్టోబర్ 3: ఆర్జీ-2 ఏరియా సేవా సమితి ద్వారా జ్యుట్ బ్యాగ్ తయారీ శిక్షణకు మహిళలు దరఖాస్తు చేసుకోవాలని డీజీఎం (ప) రాజేంద్ర ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిన్న, ఇతర మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సింగరేణి సేవా ద్వారా జ్యుట్ బ్యాగ్ తయారీలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 45 రోజులపాటు నిర్వహించనున్న ఈ శిక్షణకు ఆసక్తి గల కార్మిక కుటుంబాల మహిళలు, ప్రభావిత గ్రామాల మహిళలు ఈ నెల 7 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్హత సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు ఏరియా పర్సనల్ విభాగంలో అందజేయాలని సూచించారు.

## బీపీ, షుగర్ అదుపులో ఉంటేనే గుండె పోటు నివారణ



కరపత్రాలు విడుదల చేస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్, అక్టోబర్ 3: బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులు అదుపులో ఉంటేనే గుండెపోటు రాకుండా నివారించవచ్చని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఆర్కే 8 డిస్పెన్సరీలో మంగళవారం డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్(డీవైసీఎంవో) రమేశ్‌బాబు ఆధ్వర్యంలో ప్రపంచ హృదయ దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. గుండె పోటుపై అవగాహన కరపత్రాన్ని విడుదల చేసిన అనంతరం జీఎం మాట్లాడారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. నిత్యం నడక, వ్యాయామం చేయాలని కోరారు. అతిగా మద్యం, పొగ తాగడం, శరీరంలో కొలెస్ట్రాల్, బీపీ, షుగర్, అధిక బరువు, మానసిక ఒత్తిడి లాంటివి గుండె పోటు రావడానికి కారణంగా నిలుస్తాయన్నారు. డిస్పెన్సరీలో కార్మికులకు అన్ని వైద్యసదుపాయాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు ఫిజియోథెరపీ, ఈసీజీ సౌకర్యం ఉందన్నారు. ఏజెంట్ ఏవీ రెడ్డి, డాక్టర్ వేద వ్యాస్, మురళీధర్, హెల్త్ ఆఫీసర్ లోక్‌నాథ్‌రెడ్డి, డాక్టర్ స్వప్న పాల్గొన్నారు.

# 'అసెంబ్లీ' తర్వాతే 'గుర్తింపు' పెట్టాలి

- ఏఐటీయూసీ, బీఎంఎస్ వల్లే కార్మికుల్లో అయోమయం
- ఈ నెల 7న అన్ని కార్మిక సంఘాలతో సీఅండ్‌ఎండీ చర్చలు
- హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్




మాట్లాడుతున్న హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్, అక్టోబర్ 3: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల తర్వాతే సింగరేణిలో ఎన్నికలు నిర్వహించాలని హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐటీయూసీ, బీఎంఎస్ సింగరేణి లో ఒక్కటయ్యాయని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని 13 కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని తెలిపారు. డీవైసీఎల్‌సీ ఎన్నికల నోటిఫికేషన్ మేరకు తాము నామినేషన్ వేస్తామన్నారు. ఎన్నికల నిబంధన ప్రకారం రెండేళ్ల కాల పరిమితితోనే ఎన్నికలు జరుగుతున్నాయని, మెజార్టీ ఓట్లు సాధించిన కార్మిక సంఘాలు మాత్రం నాలుగేళ్ల కాలపరిమితి ఉండాలని కోరినట్లు చెప్పారు. అన్ని సంఘాలకు సమాన హోదా కల్పిస్తే ఎన్నికలు వద్దని ఏఐటీయూసీ పేర్కొందని చెప్పారు. యాజమాన్యం సమాన హోదా కల్పిస్తూ నిర్ణయించిన తర్వాత మాట మార్చి ఏఐటీయూసీ ఎన్నికలు పెట్టాలని అనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్మిక ద్రోహి సీతారామయ్య అని మండిపడ్డారు. గత ఎన్నికల్లో ఏఐటీయూసీ నాయకులు లక్షల రూపాయలు తీసుకొని అమ్ముడు పోయారని ఆరోపించారు. కార్మిక సంఘం ఎన్నికల్లో రాజకీయ జోక్యం సరికాదన్నారు. కోలిండియా వేతనాలకు సింగరేణికి సంబంధం లేదని, కార్మికులను అయోమయానికి గురిచేయడం తగదని పేర్కొన్నాఈ నెల 7న సింగరేణిలో అన్ని కార్మిక సంఘాలను సీఅండ్‌ఎండీ చర్చలకు ఆహ్వానించారని చెప్పారు. అందులో కార్మికుల లాభాల వాటా చెల్లింపు విధానం, రికవరీ చేసిన ఐటీపై మాట్లాడడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ బ్రాంచ్ కార్యదర్శి తిప్పారపు సారయ్య, ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, కేంద్ర కార్యదర్శి గొల్ల సత్యనారాయణ, నాయకులు లక్ష్మణ్, పెద్దన్న, రాజేంద్రప్రసాద్, నర్సయ్య, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్కే న్యూటెక్ 'ఆదర్శం'

- మేనేజర్ స్వామిరాజు

శ్రీరాంపూర్, అక్టోబర్ 3: శ్రీరాంపూర్ ఆర్కే న్యూటెక్ గని సెప్టెంబర్ నెలలో 105 శాతం ఉత్పత్తి సాధించి, ఇతర గనులకు ఆదర్శంగా నిలిచిందని మేనేజర్ సాయి ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం గనిపై కార్మికుల అభినందన సభలో మేనేజర్ మాట్లాడారు. ఉత్పత్తి లక్ష్య సాధనలో ఆర్కే న్యూటెక్ గని ముందంజలో ఉందన్నారు. ఈ సందర్భంగా కార్మికులు, అధికారులు, సూపర్‌వైజరీ సిబ్బందిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో వార్షిక ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని కోరారు. రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గని సేఫ్టీ ఆఫీసర్ కొట్టె రమేశ్, సీనియర్ పీవో పాల్ సృజన్, వెంటిలేషన్ ఆఫీసర్ శంకర్, ఈఈ కృష్ణ, జేవో స్టాన్లీ జోన్స్, టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి జంపయ్య, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, నాయకులు మహేందర్, వినయ్, సురేందర్, అజయ్ పాల్గొన్నారు.

## లక్ష్య సాధనకు కృషి చేయాలి

శ్రీరాంపూర్, అక్టోబర్ 3: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7గని వార్షిక ఉత్పత్తి 100 శాతం సాధించడానికి కార్మికులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని మేనేజర్ సాయిప్రసాద్ కోరారు. మంగళవారం గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్కే 7గని సెప్టెంబర్ నెలలో 102 శాతం ఉత్పత్తి సాధించిందన్నారు. ఇందుకు కృషి చేసిన కార్మికులు, అధికారులు, సూపర్‌వైజరీ సిబ్బందిని జీఎం సంజీవరెడ్డి, ఏజెంట్ రాముడు అభినందించారు. ఇదే స్ఫూర్తితో గని వార్షిక ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని పిలుపునిచ్చారు. పనిస్థలాల్లో రక్షణ సూత్రాలు తప్పని సరిగా పాటించాలని కోరారు. గనిలో గడిచిన ఆరు నెలల్లో ఒక్క ప్రమాదం కూడా జరగలేదన్నారు. ప్రమాద రహిత గనిగా ముందుందన్నారు. ఉద్యోగులు ప్రతి ఒక్కరూ సేఫ్టీ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌వోపీ)పై అవగాహనతో పని చేయాలని కోరారు. కార్మికులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. ఈ నెల 31 వరకు గని ఆవరణలో పరిశుభ్రతా పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. సేఫ్టీ ఆఫీసర్ రవిశంకర్, ఈఈ ప్రవీణ్, అండర్ మేనేజర్లు రవీందర్, శ్రీనివాస్, సీనియర్ పీవో సంతన్, టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి మెండ వెంకటి, నాయకులు రవీందర్, శ్రీకాంత్, శ్రీధర్, మహేందర్ పాల్గొన్నారు.

# కోలిండియా స్థాయిలో పతకాలు సాధించాలి

- బెల్లంపల్లి ఏరియా జీఎం రవి ప్రసాద్
- గోలేటిలో స్పోర్ట్స్ ప్రారంభం

రెబ్బెన, అక్టోబర్ 3: బెల్లంపల్లి ఏరియాలోని క్రీడాకారులు కోలిండియా స్థాయి పోటీలకు ఎంపికై పతకాలు సాధించి ఏరియాకు మంచి పేరు తీసుకురావాలని జీఎం రవిప్రసాద్ సూచించారు. గోలేటి సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ 90 వార్షిక క్రీడల్లో భాగంగా బాడీబిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ నియర్ బై ఏరియా క్రీడలను ప్రారంభించి, మాట్లాడారు. యాజమాన్యం క్రీడాకారుల కు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నదని తెలిపారు. గోలేటి టౌన్‌షిప్‌లో శ్రీ భీమన్న క్రీడా మైదానం, సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడా మైదానం అందుబాటులో ఉన్నాయని, వీటిలో సాధన చేస్తూ పతకాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం మచ్చగిరి నరేందర్, ఏరియా డీవైపీఎం రెడ్డి మల్ల తిరుపతి, సీనియర్ పీవో ప్రశాంత్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, బెల్లంపల్లి మందమర్రి ఏరియాలో స్పోర్ట్స్ కో ఆర్డినేటర్లు మురహరి రావు, రవికుమార్, జనరల్ కెప్టెన్లు చంద్ర కుమార్, చిన్నయ్య, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.



గోలేటి సీఈఆర్ క్లబ్‌లో నియర్ బై ఏరియా క్రీడలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న బెల్లంపల్లి జీఎం రవి ప్రసాద్